సాక్షి అన్నమయ్య జిల్లా

బుధవారం । 14 । మే । 2025



మదనపల్లె మున్సిపాలిటీలో రూ.29 లక్షలు స్వాహా

మదనపల్లె మున్సిపాలిటీలో రూ.29.50 లక్షల నిధుల స్వాహా వ్యవహారం మంగళవారం వెలుగులోకి వచ్చింది. - 8లో



కమనీయం .. లక్ష్మీ నృసింహుని కల్యాణం

భువనగిరి శ్రీలక్ష్మీదేవి సమేత నృసింహ స్వామి కల్యాణ మహోత్సవం మంగళవారం కమనీయంగా సాగింది. - 8లో

మదనపల్లె : టమాటా ధరలు (10 కిలోలు)

	కనిష్టం	గరిష్టం
మొదటిరకం	రూ.90	రూ.104
రెండోరకం	రూ.66	రూ.88

మార్కెట్‌కు వచ్చిన మొత్తం సరుకు : 679 మెట్రిక్ టన్నులు



న్యూస్‌రీల్

20న మెగా జాబ్ మేళా

రాయచోటి జగదాంబసెంటర్ : ఏపీ స్టేట్ స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ (ఏపీఎస్ఎస్‌డీసీ) ఆధ్వర్యంలో అన్నమయ్య జిల్లాలోని రాజంపేట ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో ఈ నెల 20వ తేదీన మెగా జాబ్ మేళా నిర్వహిస్తున్నట్లు జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి దాసరి నాగార్జున మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలోని యువతీ యువకులు ఉద్యోగమేళాను సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

టూరిజం మేనేజర్ బదిలీ

బి.కొత్తకోట : మండలంలోని పర్యాటక కేంద్రం హార్సిలీహిల్స్ టూరిజం మేనేజర్ నేదురుమల్లి సాల్విన్ రెడ్డి బదిలీ అయ్యారు. ఇక్కడి నుంచి నెల్లూరు టూరిజం యూనిట్‌కు బదిలీ అవ్వగా మంగళవారం బాధ్యతలు చేపట్టారు. ఇక్కడికి ఇంకా ఎవరిని నియమించలేదు. సాల్విన్ రెడ్డి పనిచేసిన కాలంలో పర్యాటకశాఖకు గణనీయమైన ఆదాయం వచ్చేలా కృషి చేశారు. కాగా రాష్ట్రంలోనే గుర్తింపు పొందిన హార్సిలీహిల్స్‌కు కొత్త మేనేజర్ నియామకం విషయంలో అనుభవాన్ని దృష్టిలో పెట్టుకుని నియామకం చేయాల్సి ఉంది.

ప్రభుత్వ సేవలను సద్వినియోగం చేసుకోవాలి

రాయచోటి : వాట్సప్ ద్వారా ప్రభుత్వ పాలనలో భాగంగా వాట్సప్ మనమిత్ర స్టాండీని జేసీ ఆదర్శ రాజేంద్రన్ ప్రారంభించారు. గురువారం రాయచోటి కలెక్టరేట్‌లో జాయింట్ కలెక్టర్ లాంఛనంగా ప్రారంభించారు. జేసీ మాట్లాడుతూ వాట్సప్ ద్వారా దాదాపు 300కు పైగా ప్రభుత్వం సేవలు అందిస్తుందని పేర్కొన్నారు. ప్రభుత్వ సేవలను పొందేందుకు 9552300009 నెంబర్‌కు వాట్సప్‌లో హాయ్ అనే మెసేజ్ పెడితే సరిపోతుందన్నారు. తరువాత వాట్సప్‌లో వచ్చే సూచనల ప్రకారం ప్రజలు తమకు కావాల్సిన సేవలను పొందవచ్చన్నారు. జీఎస్‌డబ్ల్యుఎస్ శాఖ జిల్లా అధికారి లక్ష్మీపతి మాట్లాడుతూ ప్రజలు వాట్సప్ గవర్నెన్స్‌ను ఉపయోగించుకోవచ్చన్నారు.

మామిడి రైతు కుదేలు



నా పేరు గుగ్గిళ్ల చంద్ర. మాది మండల కేంద్రమైన టి.సుండుపల్లె. నేను నాలుగు ఎకరాల్లో మామిడి వేశాను. 12 ఏళ్ల చెట్లు కావడంతో గతేడాది దిగుబడి బాగుండేది. ఈసారి పెద్దగా లేదు. నేను బేనీషా, ఖాదర్, లాల్ బహార్‌ను సాగు చేశాను. ధర చూస్తే చాలా తక్కువగా ఉండడంతో ఏమి చేయాలో పాలుపోవడం లేదు.

- తోటల్లో చెట్లకు కాయలు లేవు... పండ్లకు ధర లేదు
- వ్యాపారులు, దళారుల కుమ్మక్కుతో అంతంతమాత్రంగానే మామిడికి రేట్లు
- దేశంలో పేరు ఉన్న బీరబల్లి బేనీషా టన్ను రూ. 30-35 వేలలోపే
- సాధారణ రకం కాయలకు రూ. 15,000 మాత్రమే పలుకుతున్న ధర
- గతంతో పోలిస్తే ఈసారి భారీగా పడిపోయిన మామిడి ధరలు
- అన్నమయ్య జిల్లాలో 37 వేల హెక్టార్లలో మామిడి సాగు



కాయలను గ్రేడింగ్ చేస్తున్న కూలీలు



సాక్షి రాయచోటి : మామిడి రైతులకు ఈసారి కష్టకాలమే కనిపిస్తోంది. ఆశించిన మేర పంట దిగుబడులు లేవు...ప్రకృతి కరుణించక, తెగుళ్ల బారినపడి...తెగులు, చలి, మంచు ప్రభావం మామిడి రైతన్నను తీవ్రంగా దెబ్బతీసింది. భారీగా ఉన్న అంచనాల నుంచి కొంతమేరనే వచ్చిన దిగుబడి రైతులను కుంగదీస్తోంది. పెద్ద చెట్ల నుంచి ఎకరాకు ఐదు టన్నులకు పైగా దిగుబడి వచ్చే పరిస్థితి నుంచి టన్నుకూడా వచ్చే పరిస్థితి లేకపోయింది. పైగా ఇటీవల అంతో ఇంతో ఉన్న కాయలను కూడా రెండు, మూడు దఫాలుగా వచ్చిన పెనుగాలులు కోలుకోలేని దెబ్బతీశాయి. చెట్లపై ఉన్న కాయలు రాలిపోవడంతో దిక్కుతోచని పరిస్థితిలో అన్నదాత కనీస ధరలు ఉంటాయని భావించినా నిరాశే ఎదురవుతోంది. గతేడాదితో పోలిస్తే ఈసారి గణనీయంగా ధరలు పడిపోయాయి. దేశ స్థాయిలో వీరబల్లి బేనీషాకు పేరున్నా...ఆ కాయలు కూడా ప్రస్తుతం టన్ను రూ. 30-35 వేలకు పడిపోవడం ఆందోళన కలిగించే పరిణామం.

మామిడి రైతును దెబ్బతీసిన ప్రకృతి

అన్నమయ్య జిల్లాలో సుమారు 37 వేల హెక్టార్లలో మామిడి తోటలు ఉన్నాయి. అందులో సుమారు 20 వేల హెక్టార్లలో పెద్ద పెద్ద మామిడి తోటలు ఉన్నట్లు ఉద్యానశాఖ అంచనా. ఈసారి ప్రకృతి దెబ్బకు మామిడి రైతు పూర్తిగా దెబ్బతిన్నాడు. ప్రధానంగా గత నవంబరు, డిసెంబరులో మంచు ప్రభావంతో వచ్చిన పూత, పిందె రాలిపోయి దెబ్బతినడం ఒక ఎత్తయితే, తర్వాత వచ్చిన బంక తెగులు చెట్లను తీవ్రంగా దెబ్బతీసింది. మరోపక్క పెనుగాలులు, వడగండ్ల వాన రాయచోటి నియోజకవర్గంతోపాటు రాజంపేట, రైల్వే కోడూరు, పీలేరు తదితర ప్రాంతాల్లో కాయలు రాలిపోయాయి. తోటలపై కేవలం 15-20 శాతం మాత్రమే అక్కడక్కడ కాయలు కనిపిస్తున్నాయి. ప్రకృతి దెబ్బకు ఈసారి పెద్ద ఎత్తున రావాల్సిన దిగుబడి కూడా రాకపోవడంతో మామిడి రైతులు ఏం చేయాలో పాలుపోక కష్టాల కడలిలో నెట్టుకొస్తున్నారు.

తగ్గిన దిగుబడులు

అన్నమయ్య జిల్లా మామిడి పంటకు ప్రసిద్ధి చెందింది. ప్రధానంగా లాల్ బహార్, బేనీషా, ఖాదర్, తోతాపురి, బెంగులూర, ఇమామ్ పసంద్, చెరుకు రసం, సువర్ణ రేఖ, దసేరి, మలుగ్బా తదితర రకాలు సాగు చేశారు. రైల్వేకోడూరు నియోజకవర్గంతోపాటు రాయచోటి, రాజంపేట, పీలేరు, మదనపల్లె, తంబళ్లపల్లె నియోజకవర్గాల్లో మామిడి తోటలు విస్తరించాయి. అయితే దిగుబడులు పెద్దగా లేకపోవడంతో ఈసారి జిల్లా వ్యాప్తంగా అంతంత మాత్రంగానే కాయలు కనిపిస్తున్నాయి.

మామిడి ధర అంతంతే

అన్నమయ్య జిల్లాలో మామిడి పంటకు సంబంధించి అన్నదాతకు కష్టాలు తప్పడం లేదు. ఒకవైపు దిగుబడి అమాంతంగా తగ్గిపోగా, మరోవైపు ధరలు పతనం కావడంతో అన్నదాత ఆందోళన చెందుతున్నాడు. గత ఏడాది మొదటిరకం లాల్‌బహార్, బేనీషా, ఇమామ్ పసంద్ తదితర రకాలు టన్ను కాయలు రూ. 80 వేలు నుంచి రూ. లక్ష వరకు పలికాయి. ప్రస్తుతం రూ. 30-40 వేలకు పడిపోవడం చూస్తే పరిస్థితి ఇబ్బంది కరంగా మారింది. అంతేకాకుండా మిగిలిన సాధారణ రకం కాయలైతే రూ. 10 వేలు, రూ. 15 వేలు, రూ. 20 వేలులోపు మాత్రమే పలుకుతుండడంతో మామిడి రైతుకు గిట్టుబాటు లభించని పరిస్థితి కనిపిస్తోంది. ఏది ఏమైనా ఈసారి మామిడి రైతుకు ఒకవైపు ప్రకృతి దెబ్బతీయగా, మరోపక్క ధరలు పడిపోవడంతో దిక్కుతోచని పరిస్థితుల్లో రైతులు కొట్టుమిట్టాడుతున్నాడు.

దళారులు, వ్యాపారుల ములాఖత్



ప్రతి ఏడాది మార్చి, ఏప్రిల్, మే, జూన్ నెలలకు సంబంధించి మామిడి సీజన్‌గా భావిస్తారు. ప్రధానంగా ఇక్కడ పండించిన మామిడి కాయలు మహారాష్ట్ర, తమిళనాడు, తెలంగాణ, ఢిల్లీ తదితర ప్రాంతాలకు పెద్ద సంఖ్యలో వెళతాయి. అయితే ఢిల్లీ, హర్యాన తదితర ప్రాంతాల నుంచి పదుల సంఖ్యలో వ్యాపారులు వచ్చి రైల్వేకోడూరు, రాయచోటి ప్రాంతాల్లో బస చేస్తారు. అయితే ధరలు వివిధ రాష్ట్రాల్లో కొంతమేర అధికంగా ఉన్నా కొనేందుకు వచ్చిన వ్యాపారులతో స్థానికంగా ఉన్న దళారులు మాట్లాడుకుని ధరలను శాసిస్తున్నారు. ఎక్కడికక్కడ వారు అనుకున్న ధర ప్రకారం కొనుగోలు చేస్తున్నారు. రైతులు కూడా దళారుల ద్వారానే వ్యాపారస్తులతో ధరలు మాట్లాడుకోవడంతో ఆశించిన మేర లాభాలు ఒనగూరడం లేదు. ఇక్కడ ధరలు తక్కువగా ఉన్నాయని ఇతర రాష్ట్రాలకు వెళ్లి రైతులు అమ్ముకునే పరిస్థితి కూడా లేదు.

దీక్షిత్ మృతదేహం వద్ద విలపిస్తున్న కుటుంబ సభ్యులు



విషాద సెలవులు!

ఆటపాటలతో.. అల్లరి చేష్టలతో ఆనందంగా గడపాల్సిన సెలవు రోజులు.. విషాదంగా మారిపోయాయి. కన్నవారికి జీవితాంతం చెరగని చేదు జ్ఞాపకాలుగా మిగిలిపోయాయి..

అమ్మమ్మ ఒళ్లో నిదురోతారని... తాతయ్యతో కబుర్లెన్నో చెబుతారని ఆశతో పిల్లలను ఊరికి పంపించారు.. అత్తమ్మ చేసిన వంటలు తింటూ.. మామయ్యతో ముచ్చట్లాడుకుంటుంటారని కలలుగన్నారు.

పల్లె'టూరు'కెళ్లి.. పచ్చని పొలాల్లో విహరిస్తారని మురిసిపోయారు. చిన్నప్పుడు తాము తిరిగిన వీధుల్లో నడిచి.. బోలెడు జ్ఞాపకాలు ఒడిసి పట్టుకొస్తారని ఆ తల్లిదండ్రులు ఆశ పడ్డారు. ఇంటికొచ్చాక ఒక్కొక్కటీ చెబుతుంటే వింటూ మురిసిపోవాలని ముచ్చటపడ్డారు.

విధి మాటేసిన విషయం పసి గట్టలేక పోయారు. పసి పిల్లలను ఇంత కర్కశంగా చిదిమేస్తుందని.. 'ఈత' రూపంలో మృత్యు గీతం రాస్తుందని ఊహించలేకపోయారు.

చిన్నారులపై ఎవరి దిష్టి తగిలిందో.. ఏ దుష్టశక్తి ఆవహించిందో గానీ చెరువు దగ్గరకు ఐదుగురూ తోడుగా వెళ్లారు.. ముందు ఎవరు దిగారో.. ఏమైందో మెల్లగా చెరువులోకి జారుకున్నారు. తాము వెళ్లేది చెరువులోకి కాదని.. మృత్యు ఒళ్లోకి అని తెలిసుండదు పాపం..

ఒక్కో ఘడియ గడుస్తోంది.. నిమిషాలు.. గంటలు దాటుతున్నాయి. చూస్తుండగానే చీకటి పడింది.. పిల్లలేమో ఇంటికి రాలేదు. అవ్వ ముఖంలో దిగులు కమ్ముకుంది. అత్తామామల మనసుల్లో కలవరం మొదలైంది. పిల్లలు ఇంటికి రాని విషయం ఊరిలో ఉన్న తల్లిదండ్రులకు చేరింది. కాసేపటికే 'చావు' కబురు చెవినపడింది. అంతే.. ఒక్కసారిగా వారిపై పిడుగుపడ్డట్టయ్యింది. వారి గుండె పగిలి 'చెరువైంది' సెలవుల్లో ఆడుకుంటామని చెప్పి.. సెలవంటూ వెళ్లిపోతారా.. అంటూ రోదిస్తుంటే కంటి చెరువు తెగి నీటి ధార పొంగి పారింది.

పల్లెటూరి జ్ఞాపకాలు.. పచ్చని పొలాల కబుర్లు ఎవరు చెబుతారంటూ కన్నవారి హృదయాలు గుచ్చి గుచ్చి ప్రశ్నిస్తుంటే.. ఆ తల్లిదండ్రుల ప్రశ్నలకి జవాబు చెప్పేదెవరు.. వారి కడుపుకోతను తీర్చేదెవరు..? ఆ చేదు జ్ఞాపకాలకు మందు పూసేదెవరు.. ?

పిల్లోళ్ల ఈత సరదా .. కన్నోళ్లకు కడుపుకోత మిగిల్చిన ఈ విషాద ఘటన బ్రహ్మంగారి మఠం మండలంలో చోటు చేసుకుంది. మల్లేపల్లె చెరువులో మంగళవారం సాయంత్రం ఈత కోసం వెళ్లి ఐదుగురు చిన్నారులు మృత్యువాత పడిన ఘటన నాలుగు కుటుంబాల్లో తీరని విషాదం నింపింది.

– బ్రహ్మంగారి మఠం



హర్ష (12) (ఫైల్)



దీక్షిత్(12) (ఫైల్)



చెరువు దగ్గర గుమికూడిన ప్రజలు



గాలింపు చర్యలను పర్యవేక్షిస్తున్న డీఎస్పీ రాజేంద్ర ప్రసాద్

పేకాట ఆర్గనైజర్ వెంట 'డబుల్ స్టార్' అధికారి

- చెట్టాపట్టాలేసుకుని సింగపూర్‌కు పయనం
- ఎంచక్కా జాలీగా సాగిన ట్రిప్

సాక్షి టాస్క్‌ఫోర్స్ : కడప-కర్నూలు, చిత్తూరు-అన్నమయ్య జిల్లాలకు మోస్ట్ వాంటెడ్ గ్యాంబ్లర్ అయిన అశోక్ రెడ్డి గతంలో చాలా కేసుల్లో గ్యాంబ్లింగ్ ఆర్గనైజర్ గా ఉండి చాలా కుటుంబాల అధోగతికి కారకుడై ఉన్నాడు. 10 రూపాయలు, 20 రూపాయలు వడ్డీ తో పేకాట రాయుళ్లకు డబ్బు ఇచ్చి వారి తోనే పేకాట ఆడించి ఎంతో మంది జీవితాలతో ఆడుకుంటున్నాడు. అలాంటి వ్యక్తితో ఇటీవల కడప జిల్లాలోని 'డబుల్ స్టార్' అధికారి చెట్టాపట్టాలేసుకుని సింగపూర్ వెళ్లారు. కాగా ఈ ఎస్ఐ కడప జిల్లాలో.. జిల్లా పోలీస్ అధికారి తర్వాత అంతా... తానే అంటూ అన్ని పోలీస్ స్టేషన్‌లలో ఎస్ఐల నియామకాలలో ప్రత్యక్షంగానో పరోక్షంగానో తన ఉనికిని చాటుకుంటున్నారు. తనకు అనుకూలంగా లేని, తన నామస్మరణ చేయని వారిని, నిక్కచ్చిగా పనిచేసే కొంతమంది నియామకాల విషయంలో అడ్డు తగులుతూ వారికి పోస్టింగులు లేకుండా చేస్తూ ఉన్నారనే ఆరోపణలు ఉన్నాయి. ఈ 'డబుల్ స్టార్' అధికారి సింగపూర్‌లో గ్యాంబ్లర్ అశోక్ రెడ్డి ఫ్యామిలీతో తన ఫ్యామిలీ కూడా ఉండి విలాసంగా గడుపుతున్నారు. మంగళవారం ఒకే విమానంలో తిరుగు ప్రయాణం కాబోతున్నట్లు సమాచారం. ఇలాంటి సంఘ వ్యతిరేక శక్తులతో తమ కుటుంబాల విలాసాల కోసం అవసరాల కోసం దగ్గరికి తీస్తూ వారు ఇచ్చే లంచాలకు అలవాటు పడి పోలీస్ వ్యవస్థ ఔన్నత్యాన్ని దిగజారుస్తున్నారనే ఆరోపణలు వినవస్తున్నాయి. గతంలో కడపలో పనిచేసిన ఈయన.. పనిచేసిన ప్రతి పోలీస్ స్టేషన్ పరిధిలో గ్యాంబ్లర్ అశోక్ రెడ్డి ద్వారా పెద్ద ఎత్తున జూదం నడిపించేవారు. అధిక మొత్తంలో డబ్బులు గడించారని అప్పటి అధికారులు, ప్రస్తుత అధికారులు అతనిని మందలించారనీ.. అయినా అతని పద్ధతి మార్చుకోలేదని వినికిడి. కడప, అన్నమయ్య, నంద్యాల జిల్లాలలో పాటు, తాడిపత్రితో సహా పేకాట శిబిరాలు నిర్వహించి వచ్చిన డబ్బుతో జల్సా చేసేందుకు వారి అవినాభావ సంబంధంకు గుర్తుగా ఈ ట్రిప్ కొనసాగుతోందని సమాచారం.. పైకి మాత్రం ఈ ఎస్ఐ తన ఫ్యామిలీతో సింగపూర్‌కు వెళ్లి వచ్చేందుకు ఉన్నతాధికారుల అనుమతిని సైతం తీసుకోవడం తానంతా 'నిప్పే'నని చెప్పుకునేందుకు ఇచ్చిన 'కలరింగ్' అని ప్రజలు అనుకుంటున్నారు.

- డబుల్ స్టార్ తన ఫ్యామిలీతో గ్యాంబ్లర్ అశోక్‌రెడ్డి కుటుంబంతో పాటు సింగపూర్‌కు వెళ్లి, వస్తున్న విమాన సర్వీసుల వివరాలిలా వున్నాయి. వారు చెన్నై - సింగపూర్ ప్రయాణించిన విమానం నెంబర్: ఎస్క్యూ 529. కాగా.. సింగపూర్ ఎయిర్‌లైన్స్ విమానం సర్వీసు నెంబర్: ఎస్క్యూ 528, సింగపూర్ నుంచి మంగళవారం రాత్రి 20:25 గంటలకు బయలుదేరి, చెన్నైకి చేరుకుంటారని విశ్వసనీయ సమాచారం.

కె.కె.కొట్టాల గ్రామస్తులకు న్యాయం చేయండి

- టెయిలింగ్ పాండ్‌తో వంటలు పండక నష్టపోతున్నారు
- కలెక్టర్‌ను కోరిన కడప ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి



ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డికి వినతి పత్రం అందిస్తున్న కె.కె.కొట్టాల గ్రామస్తులు

వేముల : యురేనియం బాధిత గ్రామమైన కె.కె.కొట్టాల గ్రామస్తులకు న్యాయం చేయాలని కడప ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి కలెక్టర్ చెరుకూరి శ్రీధర్‌కు విజ్ఞప్తి చేశారు. మండలంలోని కె.కె.కొట్టాల గ్రామస్తులు మంగళవారం కడప ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డిని కలిసి టెయిలింగ్ పాండ్‌తో పడుతున్న ఇబ్బందులను, సమస్యలపై వినతి పత్రం అందజేశారు. దీంతో ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి బాధిత రైతులను వెంట బెట్టుకుని కలెక్టర్ చెరుకూరి శ్రీధర్‌ను కలిశారు. ఈ సందర్భంగా ఆయన టెయిలింగ్ పాండ్‌తో కె.కె.కొట్టాల గ్రామస్తులు నష్టపోతున్న తీరును, గ్రామస్తుల ఇబ్బందులను ఇబ్బందులను కలెక్టర్‌కు వివరించారు. ఇప్పటికే టెయిలింగ్ యురేనియం వ్యర్థాలతో నిండిపోయిందని, కాలుష్యంవలన గ్రామస్తులు అనారోగ్యానికి గురవుతున్నారని విన్నవించారు. టెయిలింగ్ పాండ్ నిండిపోవడంతో టెయిలింగ్ పాండ్ ఎత్తు పెంచే పనులు చేస్తున్నారని, టెయిలింగ్ పాండ్ ఎత్తు పెంచితే గ్రామస్తులు ఇంకా తీవ్రంగా నష్టపోయే ప్రమాదం ఉందని వివరించారు. ఇప్పటికే గ్రామస్తులు తమ సమస్యలను పరిష్కరించేంతవరకు టెయిలింగ్ పాండ్ పనులు చేపట్టవద్దని పనులను అడ్డుకున్నారని పేర్కొన్నారు. వ్యర్థ పదార్థాల టెయిలింగ్ పాండ్‌తో నష్టపోతున్న కె.కె.కొట్టాల గ్రామాన్ని యూసీఐఎల్ తీసుకుని పునరావాసం, ఉద్యోగాలు, ఆర్అండ్ఆర్ ప్యాకేజీ కింద నష్టపరిహారం అందించాలని కోరారు. దీనికి స్పందించిన కలెక్టర్ శ్రీధర్ టెయిలింగ్ పాండ్‌తో నష్టపోతున్న కె.కె.కొట్టాల గ్రామాన్ని సందర్శించి గ్రామస్తులకు న్యాయం చేస్తానని హామీ ఇచ్చినట్లు బాధిత రైతులు తెలిపారు. కార్యక్రమంలో సర్పంచ్ రంగనాథం, బాధిత రైతులు పాల్గొన్నారు.

మున్సిపల్ విభాగ బలోపేతానికి కృషి చేయాలి

కడప కార్పొరేషన్ : జిల్లాలో వైఎస్సార్‌సీపీ మున్సిపల్ విభాగాన్ని బలోపేతం చేయడానికి కృషి చేయాలని కడప పార్లమెంటు సభ్యులు వైఎస్ అవినాష్‌రెడ్డి సూచించారు. మంగళవారం కలెక్టరేట్‌కు వచ్చిన ఎంపీని వైఎస్సార్‌సీపీ రాష్ట్ర మున్సిపల్ విభాగం సంయుక్త కార్యదర్శి వై. శ్రీరంజన్‌రెడ్డి మర్యాదపూర్వకంగా కలిశారు. తనకు పదవి రావడానికి కృషి చేసినందుకు కృతజ్ఞతలు తెలుపుతూ సత్కరించారు. ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ మున్సిపాలిటీల్లో ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని, తద్వారా పార్టీని పటిష్టం చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ ఆర్‌టీఐ వింగ్ జిల్లా అధ్యక్షుడు రామక్రిష్ణారెడ్డి, ఐస్‌క్రీం రవి, రెడ్డి ప్రసాద్, వెంకటేష్ పాల్గొన్నారు.

ఇదేనా గౌరవం..?



- పాలకొండ్రాయుడి కుటుంబాన్ని విస్మరించిన టీడీపీ అధిష్టానం
- చనిపోయిన సందర్భంలోనూ రాని పార్టీ అధినేతలు
- కార్పొరేషన్ పదవుల్లోనూ మొండిచేయి
- పార్టీ కోసం అహర్నిశలు కష్టపడినా దక్కని సముచిత స్థానం
- సోషల్ మీడియా, యూట్యూబ్, వాట్సాప్‌ల వేదికగా రగిలిపోతున్న సుగవాసి అనుచర వర్గం

రాయచోటి : రాయచోటిలోనే కాదు రాయలసీమలోనూ సుగవాసి పాలకొండ్రాయుడు లేని టీడీపీని ఊహించుకోవడం కష్టం. పార్టీ ఆవిర్భావం నుంచి నేటి వరకు ఆ పార్టీతో ఆయనకున్న అనుబంధం.. పార్టీ అధిష్టానంతో పెంచుకున్న బంధం.. ఆయన అనుయాయులు, అనుచర వర్గం, సామాజిక వర్గీయులతో పెనవేసుకున్న బంధం అలాంటిది. అలాంటి సుగవాసి పాలకొండ్రాయుడు మరణం సమయంలో పార్టీ పెద్దలు చూపిన చిన్నచూపు అందరినీ ఆశ్చర్య చెకితులను చేసింది. పాలకొండ్రాయుడు పట్ల టీడీపీ అధిష్టాన వైఖరిపై రాయుడు అనుయాయులు, తెలుగు తమ్ముళ్ల అసహనం, ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. నాలుగు దశాబ్దాల పాటు టీడీపీ జెండా మోసిన నేతకు నివాళులు అర్పించే టైం పార్టీ అధినేతకు లేదా అంటూ రగిలిపోయారు. నాలుగు దశాబ్దాల పాటు పార్టీకి సేవలు అందించిన నిజమైన నాయకుడు పాలకొండ్రాయుడుకు పార్టీ అధిష్టానం ఇచ్చే గౌరవం ఇదేనా అంటూ నిలదీస్తున్నారు.

కాంగ్రెస్ పార్టీకి తిరుగులేని రాయచోటిలో స్వతంత్ర అభ్యర్థిగా నిలిచి రెండు పర్యాయాలు ఎమ్మెల్యేగా గెలుపొందిన పాలకొండ్రాయుడును టీడీపీని స్థాపించిన ఎన్‌టీఆర్ పిలిస్తే టీడీపీలోకి వెళ్లారనేది అందరికీ తెలిసిన సత్యం. 1983 ఎన్‌టీఆర్ సునామీలో కూడా ఇండిపెండెంట్ అభ్యర్థిగా రాయచోటి ఎమ్మెల్యేగా సుగవాసి గెలుపొందారు. రాజంపేట పార్లమెంట్‌కు అభ్యర్థి దొరకని పరిస్థితులలో టీడీపీ అధ్యక్షులు ఎన్‌టీఆర్ కోరితే పార్టీ అధిష్టానం నిర్ణయానికి కట్టుబడి టీడీపీ ఎంపీగా పోటీ చేసి గెలిచారు. ఎన్‌టీఆర్ అనంతరం పార్టీ అధినేతగా పగ్గాలు చేపట్టిన చంద్రబాబు వెంట నడిచారు. టీడీపీకి స్థానం లేదనుకున్న రాయచోటిలో ఎంపీతో పాటు నాలుగు సార్లు ఎమ్మెల్యేగా గెలిచి చూపించారని పేర్కొంటున్నారు. పార్టీ కష్టాలలో సైతం అధినేతకు అండగా నిలిచి రాయచోటిలోనే కాకుండా రాయలసీమ వ్యాప్తంగా తన సామాజికవర్గాన్ని బలపరుస్తూ తిరుగులేని నేతగా కూడా కొనసాగారు. అలాంటి నాయకుడు చనిపోయిన సందర్భంలో టీడీపీ అధినేత ముఖ్యమంత్రి నారా చంద్రబాబు లేదా ఆయన తనయుడు లోకేష్‌బాబు కానీ పరామర్శకు రాకపోవడం పట్ల సుగవాసి కుటుంబానికి పార్టీలో ఉన్న స్థానాన్ని బయట పెట్టిందన్న విమర్శలు వినిపిస్తున్నాయి.

సిండికేట్ వాటా ఘర్షణలో చనిపోతే..

ఎవరో.. ఇద్దరు టీడీపీ నేతలు మధ్యం సిండికేట్‌లో వాటాల కోసం కొట్టుకు చనిపోతే చంద్రబాబు వెళ్లారు.. నిశ్చయ తాంబూలాలు, పెండ్లిళ్లు, పుట్టిన రోజుల వేడుకలకు సైతం హాజరవుతున్న బాబు తనతో కలిసి 40 సంవత్సరాల పాటు ప్రయాణం సాగించిన సహచరుని చివరి చూపుగా నివాళులు అర్పించడానికి కూడా రాకపోవడం ఎంత వరకు సమంజసమంటూ.. సోషల్ మీడియా, యూట్యూబ్, వాట్సాప్, ఇన్‌స్టాగామ్ వేదికలుగా సుగవాసి అనుయాయులు ప్రచారం చేస్తున్నారు. నారా లోకేష్ పక్కనే ఉన్న సత్యవేడుకు వచ్చి వెళ్లారు తప్ప.. రాయచోటికి వచ్చి... సుగవాసి పాలకొండ్రాయుడుకు నివాళులు అర్పించి ఉంటే ఎంత బాగుండేది? అన్న వ్యాఖ్యలు వినిపిస్తున్నాయి. ఇదేనా.. పెద్దాయనకు మీరు ఇచ్చే నివాళులు? మర్యాద? అంటూ నెటిజన్లు ఏకిపారేస్తున్నారు.

సోషల్ మీడియా వేదికగా..

పార్టీ కష్ట నష్టాలలో ముందుంటూ నడిపిస్తూ వచ్చిన పాలకొండ్రాయుడుకు ఆయన చివరి అంకంలో జరిగిన ఘోర అవమానంపై సోషల్ మీడియా వేదికగా ఆయన అనుయాయులు, అనుచర వర్గం టీడీపీ అధిష్టానంపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. పార్టీ పేరుతో ఉన్న సోషల్ మీడియాలో కనీసం ఒక పోస్ట్ పెట్టి శ్రద్ధాంజలి ఘటించలేదంటూ దుమ్మెత్తి పోస్తున్నారు. నోట్ల కట్టలకు, పదవులకు పబ్లిక్‌గా అమ్ముడుపోయే నాయకులున్న ఈ కాలంలో బతికున్నని రోజులు పసుపు కండువా మోసాడంటూ రాయుడు సేవలను కీర్తిస్తున్నారు. 80 సంవత్సరాల వయసులో 45 డిగ్రీల ఎండను సైతం లెక్కచేయకుండా రాయచోటిలో టీడీపీని గెలిపించేందుకు ఆయన చేసిన ప్రచారాలను వాట్సాప్‌లో, ఫేస్‌బుక్‌లలో పెడుతూ టీడీపీ అధిష్టానంపై విమర్శలు గుప్పిస్తున్నారు. కనీసం పార్టీ అఫీసియల్ సోషల్ మీడియా ద్వారా శ్రద్ధాంజలి ఘటించకపోవడం దారుణమంటూ మండిపడుతున్నారు.

వారసులకు అన్యాయమే..

తెలుగుదేశం పార్టీకి అహర్నిశలు కష్టపడ్డ సుగవాసి వారసులుగా రాజకీయ ప్రవేశం చేసిన ఆయన తనయుడు సుగవాసి బాలసుబ్రమణ్యంకు పార్టీ నుంచి ఆశించిన మేర స్థానం లభించలేదు. గత అసెంబ్లీ ఎన్నికలలో రాయచోటి స్థానాన్ని ఆశించి భంగపాటుకు గురైన సుగవాసి కుటుంబానికి చివరి నిమిషంలో రాజంపేట స్థానాన్ని కేటాయించారు. అన్నమయ్య జిల్లాలోనే కాకుండా రాయలసీమ వ్యాప్తంగా బలిజ సామాజికవర్గ ఓట్లను దూరం కానివ్వకుండా చేసేందుకు తక్కువ సమయంలో రాజంపేట అసెంబ్లీ స్థానాన్ని కేటాయించారు. ఆ ఎన్నికల్లో సుగవాసి బాలసుబ్రమణ్యం పోటీ చేసినా సొంత పార్టీ నాయకులు వెన్నుపోటు పొడవడంతో ఓటమి పాలయ్యారు. రెండు రోజుల కిందట పార్టీ అధిష్టానం ప్రకటించిన రాష్ట్ర కార్పొరేషన్ల పదవుల లోనూ సుగవాసి కుటుంబానికి మొండిచేయి చూపించింది. పార్టీ అధికారంలోకి వచ్చినప్పటి నుంచి ముఖ్యమంత్రి చంద్రబాబు, లోకేష్ లను పాలకొండ్రాయుడుతో పాటు ఆయన తనయుడు బాలసుబ్రమణ్యం, ప్రసాద్‌బాబులు పలుమార్లు కలిసినా తగిన ప్రాధాన్యత లేకుండా పోయిందన్న వేదన, అక్కసు ఆ పార్టీ నాయకులు, సుగవాసి వర్గీయులలో నిగూఢంగా ఉంది. ఇప్పటికే కూటమి పాలనపై రగిలిపోతున్న టీడీపీ వర్గీయులకు సుగవాసికి లభించని ప్రాధాన్యతతో వారి ఆవేశం సోషల్ మీడియా వేదికగా నిప్పులు కక్కుతోంది.

క్లుప్తంగా

ఇద్దరి ఆత్మహత్యాయత్నం

మదనపల్లె రూరల్ : వేర్వేరు ఘటనల్లో ఇద్దరు వ్యక్తులు ఆత్మహత్యాయత్నానికి పాల్పడి స్థానిక ప్రభుత్వ జిల్లా ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. మదనపల్లె మండలం బసినికొండ గ్రామానికి చెందిన జబీద్ భార్య హసీనా (35) కుటుంబ సమస్యల కారణంగా భర్తతో గొడవ పడింది. మనస్థాపం చెంది ఇంటి వద్ద నిద్ర మాత్రలు మింగింది. అదేవిధంగా నిమ్మనపల్లె మండలం ముష్టూరు పంచాయతీ పారాసువారిపల్లెకు చెందిన లక్ష్మీనారాయణ కుమారుడు శ్రీనివాసులు (32) కుటుంబ సమస్యల కారణంగా అతిగా మద్యం తాగి అందులోనే పురుగుమందు కలుపుకున్నాడు. ఆయా ఘటనల్లో గమనించిన కుటుంబ సభ్యులు బాధితులను 108 వాహనంలో మదనపల్లె ప్రభుత్వ జిల్లా ఆసుపత్రికి తరలించారు.

పేకాట స్థావరంపై దాడి

మదనపల్లె రూరల్ : మదనపల్లె పట్టణం వన్ టౌన్ పరిధిలో పేకాట స్థావరంపై దాడులు నిర్వహించి తొమ్మిది మంది జూదరులను అరెస్టు చేసినట్లు వన్ టౌన్ సీఐ ఎరిషా వలి తెలిపారు. మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ సోమవారం రాత్రి పట్టణంలోని నక్కలదిన్నె ప్రాంతంలోని శ్రీనగర్ కాలనీలో పెద్ద ఎత్తున జూదం నిర్వహిస్తున్నట్లు సమాచారం అందిందన్నారు. ఎస్ఐ శివకుమార్‌తో కలిసి పేకాట స్థావరంపై దాడి చేశామన్నారు. ఈ దాడిలో కర్ణాటక రాయలపాడు, మదనపల్లె పట్టణంలోని ప్రశాంత్ నగర్, అమ్మ చెరువు మిట్ట, రాజా నగర్, ఎగువకురవంక, కలికిరి, శ్రీనగర్ కాలనీకి చెందిన 9 మందిని అదుపులోకి తీసుకుని వారి వద్ద నుంచి రూ.32040 స్వాధీనం చేసుకున్నామన్నారు.

మదనపల్లె మున్సిపాలిటీలో రూ.29 లక్షలు స్వాహా

- గుత్తలకు సంబంధించి చెల్లించిన సొమ్ముకు చేతిరాతతో
- రశీదు ఇచ్చిన ఉద్యోగి
- మున్సిపాలిటీకి జమ చేయకుండా మొత్తం స్వాహా
- రెండేళ్లుగా దాచిపెట్టిన అధికారులు
- బి.కొత్తకోట కమిషనర్, మరో ఇద్దరికి షోకాజ్ నోటీసులు
- జారీ చేసిన మున్సిపల్ ఆర్డీ



మదనపల్లె మున్సిపల్ కార్యాలయం

మదనపల్లె : మదనపల్లె స్పెషల్ గ్రేడ్ మున్సిపాలిటీలో రహస్యంగా దాగిన రూ.29.50 లక్షల నిధుల స్వాహా వ్యవహారం మంగళవారం వెలుగులోకి వచ్చింది. సాధారణంగా మున్సిపాలిటీకి పైసా సొమ్ము చెల్లించినా ఆ సొమ్ము జమ చేసినట్టు ఆన్‌లైన్ బిల్లు ఇస్తారు. అయితే లక్షలు జమ చేసిన లీజుదారునికి ఆన్‌లైన్ రశీదు కాకుండా చేతిరాత రశీదు ఇచ్చి మొత్తాన్ని స్వాహా చేసిన వ్యవహారంపై అనంతపురం మున్సిపల్ ఆర్డీ విశ్వనాథ్ ముగ్గురికి షోకాజ్ నోటీసులు జారీ చేశారు. 2023లో జరిగిన ఈ స్వాహాపై ఇప్పటివరకు కనీస చర్య లేకపోవడం అనుమానాలకు తావిస్తోంది. మున్సిపల్ అధికారులకు తెలిసినా ఈ వ్యవహారాన్ని దాచిపెట్టడం వెనుక కారణమేమిటన్న ప్రశ్న తలెత్తుతోంది.

అసలు కథ ఇదీ..

2022 ఏప్రిల్ ఒకటి నుంచి 2023 మార్చి 31 వరకు మున్సిపాలిటీకి చెందిన వారపుసంత, దినసరి మార్కెట్, జంతువధ శాలను రూ.94.55 లక్షలకు సయ్యద్ ఫారూక్ అహ్మద్ గుత్త దక్కించుకున్నాడు. ఈ గుత్త సొమ్మును పూర్తిగా చెల్లించాల్సిన గుత్తదారుడు విడతల వారీగా చెల్లింపులు చేశాడు. ఈ మొత్తంలో రూ.55 లక్షలను చెల్లించినట్టు ఆన్‌లైన్ రశీదులు ఇచ్చారని తెలిసింది. మిగిలిన దాంట్లో రూ.29.50 లక్షలను మున్సిపాలిటీకి చెల్లించాడు. మూడు విడతల్లో 2023 ఏప్రిల్ 18న రూ.10 లక్షలు, మే నెల 17న రూ.10 లక్షలు, మే నెల 27న రూ.9.50 లక్షలు చెల్లించాడు. అయితే ఈ సొమ్ము స్వీకరించిన ఉద్యోగి ఈ చెల్లింపులు ఆన్‌లైన్‌లో జమచేసి ఆన్‌లైన్ చెల్లింపు బిల్లులు ఇవ్వాలి. అయితే అలా చేయకుండా నగదు స్వీకరించినట్టుగా మున్సిపాలిటీకి చెందిన క్యాష్ రీసీవ్డ్ సీలు వేసి అందులో ఎంత మొత్తం తీసుకున్నది చేతిరాతతో సంతకం చేసి రశీదులు ఇచ్చాడు. దీనితో తన లీజు సొమ్ము చెల్లించేశానని గుత్తదారు భావించాడు. అయితే ఈ సొమ్ము మున్సిపాలిటీకి జమకాలేదు. రూ.29.50 లక్షల్లో పైసా కూడా జమ చేయకుండా పూర్తిగా స్వాహా చేసేశారు. ఇక్కడ కొసమెరుపు ఏమిటంటే.. వాస్తవంగాపై నిధులు గుత్తదారుడు చెల్లించకపోయి ఉంటే ఈపాటికే అధికారులు చర్యలు తీసుకోవాలి. అయినా ఎందుకు తీసుకోలేదో అధికారులకే తెలియాలి.

రెండేళ్లుగా దాచిపెట్టారు..

రూ.29.50 లక్షల నిధులు స్వాహా వ్యవహారాన్ని అధికారులు రెండేళ్లుగా దాచి పెట్టడం వెనుక కారణమేమిటన్న చర్చ మొదలైంది. మున్సిపల్ నిధుల వ్యవహారంపై నిత్యం జరగాల్సిన పర్యవేక్షణ జరగడం లేదా, లేక తెలిసి ఈ విషయాన్ని పట్టించుకోలేదా అన్న అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి. నిధుల స్వాహాపై ఇప్పటికే చర్యలు పూర్తి చేసి ఉంటే స్వాహా సొమ్మును తిరిగి రాబట్టి ఉండవచ్చు. లేదా గుత్తేదారుని ఫిర్యాదుతో స్వాహా చేసిన, నిబంధనలకు విరుద్ధంగా రశీదులు ఇచ్చిన ఉద్యోగులపై చర్యలు తీసుకునే అవకాశం ఉన్నప్పటికీ రెండేళ్లదాకా ఎందుకు చర్యలు తీసుకోలేదో అధికారులకే తెలియాలి.

ముగ్గురికి షోకాజ్..

గుత్తేదారు చెల్లించాల్సిన సొమ్ము విషయంలో అనంతపురం మున్సిపల్ ఆర్డీ విశ్వనాథ్ ముగ్గురికి షోకాజ్ నోటీసులు జారీ చేశారు. వీరిలో అప్పటి మున్సిపల్ ఆర్ఓ, ప్రస్తుత బి.కొత్తకోట నగర పంచాయతీ కమిషనర్ పల్లవి, జూనియర్ అసిస్టెంట్ రెడ్డిప్రసాద్, సీనియర్ అసిస్టెంట్ రామ్మూర్తిలకు ఈ నెల ఏడున షోకాజ్ నోటీసులు జారీ చేశారు. ఈ నోటీసుల్లో 2022–23 ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన గుత్తల సొమ్ము వసూలు చేయడంలో నిర్లక్ష్యం వహించారని పేర్కొన్నట్టు తెలిసింది.



చేతిరాతతో ఇచ్చిన రశీదులు

కరెంట్ షాక్‌తో పెయింటర్‌కు తీవ్ర గాయాలు

మదనపల్లె రూరల్ : కరెంట్ షాక్‌కు గురై పెయింటర్ తీవ్రంగా గాయపడి అస్వస్థతకు గురైన సంఘటన మంగళవారం కురబలకోట మండలంలో జరిగింది. మదనపల్లె పట్టణం కృష్ణానగర్‌కు చెందిన అల్లాబక్ష్ కుమారుడు సయ్యద్ బాషా (26) పెయింట్ పనులు చేస్తూ జీవిస్తున్నాడు. మంగళవారం పనులు చేసేందుకు కురబలకోట మండలం అంగళ్లుకు వెళ్లాడు. అక్కడ పనులు చేస్తూ, ప్రమాదవశాత్తు కరెంట్ షాక్‌కు గురై తీవ్రంగా గాయపడ్డాడు. గమనించిన స్థానికులు బాధితుడిని మదనపల్లె ప్రభుత్వ జిల్లా ఆసుపత్రికి తరలించారు.

పాముకాటుతో ఇద్దరికి అస్వస్థత

మదనపల్లె రూరల్ : వేర్వేరు ఘటనల్లో ఇద్దరు వ్యక్తులు పాముకాటుకు గురై తీవ్ర అస్వస్థతతో స్థానిక ప్రభుత్వ జిల్లా ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. గుర్రంకొండ మండలం శెట్టివారిపల్లె పంచాయతీ అరిగెల వారి పల్లెకు చెందిన రమణ కుమారుడు ఆనందబాబు (28) పొలం పనులకు వెళ్లాడు. స్థానికంగా ఉన్న టమాటా పొలంలో కర్రలు నాటుతుండగా అకస్మాత్తుగా పాము కాటు వేసింది. అదేవిధంగా మదనపల్లె మండలం కోళ్లబైలు పంచాయతీ మాదిగ గుంత కనుమ గ్రామానికి చెందిన నరసింహారెడ్డి భార్య భూలక్ష్మీదేవి (45) తన పొలంలోని టమాటా పంట వద్ద పనులు చేస్తుండగా పాముకాటుకు గురైంది. ఆయా ఘటనల్లో బాధితులు తీవ్ర అస్వస్థతకు గురికాగా గమనించిన కుటుంబ సభ్యులు హుటాహుటిన మదనపల్లె ప్రభుత్వ జిల్లా ఆసుపత్రికి తరలించారు.

మా బంగారం ఇప్పించండి సారూ!



ఏఎస్పీకి ఫిర్యాదు చేస్తున్న బాధితురాలు నాగమణి

రాజంపేట రూరల్ : తమ అన్న కూతురి వివాహంలో కనిపించకుండా పోయిన తన 343 గ్రాముల బంగారం ఆచూకీ కనుగొని తనకు ఇప్పించండి సారూ అని బాధిత మహిళ సానంరెడ్డి నాగమణి ఏఎస్పీని వేడుకున్నారు. మండల పరిధిలోని ఎస్.ఎ ర్రబల్లి వద్ద ఉన్న ఏఎస్పీ కార్యాలయం వద్దకు తన బంధువులతో కలసి వచ్చిన ఆమె ఏఎస్పీ మనోజ్ రామనాథ్ హెగ్డేను ఆశ్రయించి సోమవారం రాత్రి ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పట్టణంలోని విద్యుత్ నగర్‌లో నివాసం ఉంటున్న తన అన్న జోగి సుదర్శన్‌రెడ్డి కుమార్తె సాయినందిని వివాహానికి గత నెల 28న వచ్చినట్లు తెలిపారు. తన కుమార్తె వర్షిణి 343 గ్రాముల బంగారాన్ని దుస్తుల బ్యాగ్‌లో పెట్టుకుని తనవెంట తీసుకొచ్చినట్లు తెలిపారు. ఆ బ్యాగ్‌ను తన అన్న గృహంలోని పడక గదిలో గల మంచంపై ఉంచి బంధువులతో ముచ్చటించి పెళ్లి పనుల్లో నిమగ్నమైనట్లు తెలిపారు. అనంతరం రాత్రి 10.30 గంటల సమయంలో నిద్రకు ఉపక్రమించే ముందు తన కుమార్తె దుస్తులు మార్చుకునేందుకు బ్యాగ్ తెరిచినప్పుడు బంగారం అలాగే ఉందని, ఉదయం 10 గంటల సమయంలో బ్యాగును తెరవగా అందులోని దుస్తులు చెల్లాచెదురుగా పడి ఉన్నాయని పేర్కొన్నారు. దుస్తుల మధ్య ఉంచిన బంగారం కనిపించకపోవడంతో తన అన్న సుదర్శనరెడ్డితో పాటు బంధువులకు తెలియజేశామన్నారు. 19 మందిపై అనుమానం వ్యక్తం చేస్తూ పోలీసులకు ఫిర్యాదు చేశానని వారిలో కొందరు కువైట్‌కు వెళ్లి పోయారని ఆమె వివరించారు. పోలీసులు సమగ్ర దర్యాప్తు జరిపి తనకు న్యాయం చేయాలని ఆమె వేడుకున్నారు.

ఆర్టీసీ కార్మికుల ధర్నా



రాయచోటి బస్టాండ్‌లో ధర్నా చేస్తున్న ఎన్ఎంయూఏ నాయకులు

రాయచోటి టౌన్ : నేషనల్ మజ్దూర్ యూనిటీ అసోసియేషన్ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు మంగళవారం రాయచోటి ఆర్టీసీ బస్టాండ్ ఆవరణంలో ధర్నా నిర్వహించారు. జిల్లా పరిధిలోని ఐదు డిపోలకు చెందిన కార్మికులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా జోనల్ అధ్యక్షుడు వినోద్ బాబు మాట్లాడుతూ సంస్థలో ఉద్యోగులను చిన్న చిన్న కారణాలతో అధికారులు వేధించడం తగదన్నారు. ఉద్యోగ భద్రత సర్క్యులర్ వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు. సిబ్బందికి రావాల్సిన ప్రమోషన్లు వెంటనే కల్పించాలని, పెండింగ్‌లో ఉన్న డీఏలు చెల్లించాలని, మహిళా సిబ్బందికి చైల్డ్‌కేర్ లీవ్‌లు వెంటనే మంజూరు చేయాలని కోరారు. రీజనల్ కార్యదర్శి పీఎస్ఎం రాజు మాట్లాడారు. ఈ కార్యక్రమంలో రీజనల్ ప్రెసిడెంట్ ఎంఎన్‌రావు, రీజనల్ మహిళా నాయకురాలు విజయేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

పీలేరులో చోరీ



వేలిముద్రలు సేకరిస్తున్న పోలీసులు

పీలేరు రూరల్ : పీలేరు పట్టణం చెన్నారెడ్డి కాలనీలోని ఓ ఇంటిలో బంగారు, నగదు చోరీ జరిగిన సంఘటన మంగళవారం తెల్లవారుజామున జరిగింది. వివరాలిలా ఉన్నాయి. చెన్నారెడ్డి కాలనీకి చెందిన వి. శ్రీనివాసులు రెడ్డి, రజనికుమారి దంపతులు మంగళవారం తెల్లవారుజామున 3.30 గంటలకు వేపులబైలులో జరిగిన అంకాలమ్మ జాతరకు వెళ్లారు. తిరిగి ఉదయం 6.30 గంటలకు ఇంటికి వచ్చారు. అప్పటికే ఇంటి తలుపులు తెరిచి బీరువా పగులగొట్టి ఉండడంతో పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఎస్ఐ బాలకృష్ణ సంఘటన స్థలాన్ని పరిశీలించారు. వేలిముద్ర నిపుణులు సంఘటన స్థలంలో వేలిముద్రలు సేకరించారు. ఇంటి నిర్మాణం కోసం బీరువాలో దాచుకున్న రూ. 5 లక్షలు నగదుతోపాటు సుమారు 150 గ్రాముల బంగారు చోరీకి గురైందని బాధితులు తెలిపారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

ట్రాన్స్‌ఫార్మర్ ధ్వంసం

బి.కొత్తకోట : స్థానిక బడికాయలపల్లె రోడ్డులో వ్యవసాయ పొలానికి చెందిన ట్రాన్స్‌ఫార్మర్‌ను సోమవారం రాత్రి దొంగలు ధ్వంసం చేశారు. అందులోని వైరును తీసుకెళ్లారు. బాధిత రైతులు పోలీసులకు ఫిర్యాదు చేశారు.

ఎర్రచందనం దుంగలు స్వాధీనం

సిద్దవటం : మండలంలోని ఎస్. రాజంపేట గ్రామ సమీప పొలాల్లో ఎర్రచందనం దుంగలను అక్రమ రవాణాకు సిద్ధం చేస్తుండగా సోమవారం రాత్రి టాస్క్‌ఫోర్స్, సిద్దవటం అటవీశాఖ, పోలీసు శాఖ అధికారులు సంయుక్తంగా దాడులు నిర్వహించారు. ఈ దాడుల్లో ఎస్. రాజంపేట గ్రామానికి చెందిన ఇద్దరు నిందితులను అదుపులోకి తీసుకొని వారి వద్ద నుంచి 9 ఎర్రచందనం దుంగలను స్వాధీనం చేసుకున్నారు. నిందితులను తిరుపతి తరలించి విచారిస్తున్నట్లు తెలిసింది.

రేపు విద్యాభవన్ వద్ద ఉపాధ్యాయుల ధర్నా

కడప ఎడ్యుకేషన్ : ప్రాథమిక విద్యారంగాన్ని బలోపేతం చేస్తామన్న ప్రభుత్వం ఆ విషయాన్ని విస్మరించి విద్యారంగ విచ్ఛిన్నానికి పూనుకోవడాన్ని నిరసిస్తూ ఈనెల 15న విజయవాడ విద్యాభవన్ వద్ద ధర్నా నిర్వహించనున్నట్లు యూటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి లక్ష్మీరాజ తెలిపారు. మంగళవారం కడప యూటీఎఫ్ కార్యాలయంలో కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఈ ధర్నాకు రాష్ట్రవ్యాప్తంగా అన్ని జిల్లాల నుంచి ఉపాధ్యాయులందరూ పెద్ద ఎత్తున హాజరై జయప్రదం చేయాలని కోరారు. ఇప్పటి వరకు జీఓ 117 రద్దు చేయకుండా పాఠశాల వ్యవస్థలో సమూల మార్పులు తీసుకువస్తున్నామని చెబుతున్నారన్నారు. మోడల్ ప్రాథమిక పాఠశాలల్లో ఎస్జీటీలకు పదోన్నతులు ఇచ్చి వారి ద్వారా భర్తీ చేయాలన్నారు.

టెంపో ఢీకొని యువకుడి దుర్మరణం



మృతి చెందిన వంశీకృష్ణ

బి.కొత్తకోట : టెంపో వాహనం ఢీకొనడంతో బైక్‌పై వెళ్తున్న యువకుడు దుర్మరణం చెందిన సంఘటన మంగళవారం రాత్రి బి.కొత్తకోట సమీపంలో జరిగింది. పోలీసుల కథనం మేరకు వివరాలు.. అనంతపురం జిల్లా ఉరవకొండకు చెందిన వంశీకృష్ణ (25) అవివాహితుడు. స్థానిక కోటవీధిలో నివాసం ఉంటూ ప్రైవేటు సంస్థలో ఉద్యోగిగా విధులు నిర్వహిస్తున్నాడు. మంగళవారం పై అధికారి గ్రామాల పర్యటనకు రావడంతో నాయనబావి వద్ద బైక్ ఉంచి అధికారి వెంట తిరిగాడు. తర్వాత నాయనబావికి వెళ్లి బైక్‌పై బి.కొత్తకోటకు వస్తున్నాడు. కస్తూర్బా స్కూల్ సమీపంలో మదనపల్లె వైపు దూడలతో వెళుతున్న టెంపో వాహనం బైకును ఢీ కొట్టింది. బైక్‌తో పాటు వంశీకృష్ణను కొంత దూరం ఈడ్చుకుని వెళ్లింది. తర్వాత టెంపో రోడ్డు పక్కన బోల్తా పడింది. వంశీకృష్ణ ఘటనా స్థలంలోనే దుర్మరణం చెందాడు. టెంపో డ్రైవర్ పరారయ్యాడు. అందులో ప్రయాణిస్తున్న మరో వ్యక్తి ఎడమ చేయి నుజ్జునుజ్జయింది. ఏఎస్ఐ భాస్కర్, పోలీసులు ఘటనా స్థలం చేరుకుని మృతదేహాన్ని మదనపల్లెకు తరలించారు.

రోడ్డు ప్రమాదంలో గాయపడిన వ్యక్తి మృతి



మృతుని పిల్లలను ఓదారుస్తున్న ఎమ్మెల్యే పెద్దిరెడ్డి ద్వారకనాథరెడ్డి



మృతి చెందిన డీవీ సిద్ధారెడ్డి

మదనపల్లె రూరల్/తంబళ్లపల్లె : రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన వ్యక్తి చికిత్స పొందుతూ మృతి చెందిన సంఘటన మంగళవారం మదనపల్లెలో జరిగింది. తంబళ్లపల్లె మండలం మర్రిమాకులపల్లి పంచాయతీ దిగువ మావిళ్లవారిపల్లెకు చెందిన చిన్నారెడ్డి కుమారుడు డీవీ సిద్ధారెడ్డి (43), ఈ నెల 10న సొంత పనులపై ద్విచక్ర వాహనంలో వెళుతుండగా, మావిళ్లవారిపల్లె కన్నెమడుగు మార్గంలోని నాయిని చెరువు వద్ద మరో ద్విచక్ర వాహనం వేగంగా వచ్చి ఢీకొంది. ప్రమాదంలో సిద్ధారెడ్డి తీవ్రంగా గాయపడగా గమనించిన స్థానికులు వెంటనే మదనపల్లె ప్రభుత్వ జిల్లా ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండడంతో మెరుగైన వైద్యం కోసం బెంగళూరుకు తరలించారు. అయితే అప్పటికే పరిస్థితి విషమించి బ్రెయిన్ డెడ్ కావడంతో, సిద్ధారెడ్డిని మదనపల్లె ప్రభుత్వ జిల్లా ఆసుపత్రికి ఈనెల 11న తీసుకువచ్చారు. చికిత్స పొందుతూ మంగళవారం తెల్లవారుజామున మృతి చెందాడు. అవుట్ పోస్ట్ పోలీస్ సిబ్బంది తంబళ్లపల్లె పోలీసులకు సమాచారం అందించడంతో, ఏఎస్ఐ నరసింహులు మదనపల్లె ప్రభుత్వ ఆసుపత్రికి చేరుకొని మృతదేహానికి పోస్టుమార్టం నిర్వహించి కుటుంబ సభ్యులకు అప్పగించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

ఎమ్మెల్యే ఆర్థిక సాయం..

మృతునికి భార్య నాగమణి, ఇంటర్ చదువుతున్న కుమార్తె రంజిత, పదో తరగతి పాసైన కుమారుడు భరత్‌కుమార్‌రెడ్డి ఉన్నారు. ఇంటి పెద్ద దిక్కుకోల్పోవడంతో ఆ కుటుంబ సభ్యుల రోదన పలువురిని కంటతడి పెట్టించింది. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే పెద్దిరెడ్డి ద్వారకనాథరెడ్డి ఆ గ్రామానికి వెళ్లి అంత్యక్రియల్లో పాల్గొన్నారు. కుటుంబ సభ్యులను పరామర్శించారు. వారికి రూ.50 వేలు ఆర్థిక సహాయం అందించి అండగా ఉంటానని భరోసా కల్పించారు. సర్పంచులు జ్యోతి, శివకుమారి, ఎంపీటీసీ సభ్యులు మహేష్, నాయకులు చంద్రశేఖరరెడ్డి, కె.ఆర్.మల్లిరెడ్డి, రామశంకర్‌రెడ్డి పాల్గొన్నారు.

అవయవదానంతో అందరికీ ఆదర్శం

- రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి
- బ్రెయిన్‌డెడ్ తర్వాత పలు అవయవాలు దానం



కొండారెడ్డి(ఫైల్)



కుమారుడి అవయవాలను దానం చేసిన తల్లిదండ్రులను ఓదారుస్తున్న ఆసుపత్రి సిబ్బంది

చిన్నమండెం : చిన్నమండెం మండలం చాకిబండ గ్రామం అంపాబత్తునివారి పల్లెకు చెందిన మద్దిరాల కంచంరెడ్డి, కోటేశ్వరమ్మ దంపతుల కుమారుడు మద్దిరాల కొండారెడ్డి(21) రోడ్డు ప్రమాదంలో మృతిచెందాడు. అతని అవయవాలు దానం చేసి మరి కొందరి ప్రాణాలను కాపాడి ఆ కుటుంబం అందరికీ ఆదర్శంగా నిలిచింది. స్థానికుల కథనం మేరకు.. మద్దిరాల కొండారెడ్డి బెంగళూరులో సివిల్ ఇంజనీర్‌గా విధులు నిర్వహిస్తున్నాడు. ఈ నెల 8వ తేదీ జరిగిన రోడ్డు ప్రమాదంలో అతను మృతి చెందాడు. వైద్యుల సూచనల మేరకు కొండారెడ్డి తల్లిదండ్రులు, కుటుంబ సభ్యులు అవయవాలు దానం చేసి మరికొందరి ప్రాణాలను నిలబెట్టే దిశగా ఆలోచించారు. కొండారెడ్డికి సంబంధించిన గుండె, లివర్, కిడ్నీలు తదితర అవయవాలు దానం చేసి అందరికీ ఆదర్శంగా నిలిచారు.

కన్నవారి కలలు కల్లలైనా..

కుమారుడి చదువు కోసం తల్లిదండ్రులు కంచంరెడ్డి, కోటేశ్వరమ్మలు ఎన్నో ఏళ్లుగా కష్టపడి వ్యవసాయ కూలి పనులు చేసుకుంటూ కుటుంబాన్ని పోషించుకున్నారు. కూలి డబ్బులతోనే కుమారుని, కుమార్తెను చదివించుకున్నారు. కుమారుడు కొండారెడ్డి సివిల్ ఇంజనీర్‌గా ప్రైవేట్ ఉద్యోగం చేస్తున్నాడనే సంతోషం ఆ కుటుంబానికి చాలా రోజులు నిలబడలేదు. విధి ఆడిన వింత నాటకంలో ఆ కుటుంబం ఉన్న ఒక్క కుమారుడిని పోగొట్టుకుంది. దీంతో తల్లిదండ్రులు, కుటుంబ సభ్యులతో పాటు చాకిబండ గ్రామంలో విషాద ఛాయలు అలుముకున్నాయి. ఇంతటి విషాదంలో కూడా వారు తమ కుమారుడి అవయవాలు దానం చేసి మరి కొందరి ప్రాణాలను కాపాడటం ఎంతో గర్వంగా ఉందని చెప్పడం అందరినీ కదిలించింది.

కమనీయం.. లక్ష్మీ నృసింహుని కల్యాణం





స్వామివారి కల్యాణాన్ని తిలకించేందుకు భారీగా తరలి వచ్చిన భక్తులు, భక్తులకు మాంగళ్యం చూపిస్తున్న వేద పండితులు

రాజంపేట రూరల్ : జిల్లాలోని ప్రముఖ వైష్ణవ పుణ్యక్షేత్రం భువనగిరి శ్రీలక్ష్మీదేవి సమేత నృసింహ స్వామి కల్యాణ మహోత్సవం మంగళవారం అత్యంత కమనీయంగా సాగింది. కల్యాణాన్ని తిలకించేందుకు ఉమ్మడి వైఎస్సార్ జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి భక్తులు పెద్ద ఎత్తున తరలివచ్చారు. శ్రీ లక్ష్మీదేవి, శ్రీ నృసింహ స్వామి ఉత్సవ మూర్తులను తొలుత పట్టు వస్త్రాలతో, ప్రత్యేక పుష్పాలతో శోభాయమానంగా అలంకరించారు. అనంతరం ప్రత్యేక వేదికపై కొలువుదీర్చి ఆలయ ప్రధాన అర్చకులు జయంతి నటరాజశర్మ, ధూళిపాటి కృష్ణమోహన్, వేదపండితులు అవధానం రాజశేఖరశర్మ, ధూళిపాటి కాళీచరణ్‌శర్మ, షడ్దర్శనం సత్యనారాయణ, నందుల బృందం వేదమంత్రోచ్ఛారణతో స్వామివారి కల్యాణ మహోత్సవాన్ని అంగరంగ వైభవంగా నిర్వహించారు. భక్తజనం స్వామి వారి కల్యాణాన్ని కనులారా వీక్షించి పులకించిపోయారు. స్వామి వారికి భువనగిరిపల్లి కోదండరామస్వామి ఆలయం నుంచి కొండపైకి మాజీ మంత్రి పసుపులేటి బ్రహ్మయ్య కుమారులు పసుపులేటి వీరప్రదీప్, రమ్య, పసుపులేటి పవన్‌కుమార్, సింధు దంపతులు ఆలయ ధర్మకర్తలతో కలిసి పట్టువస్త్రాలు, ముత్యాల తలంబ్రాలు సమర్పించారు. క్రిష్ణచైతన్య అన్నదాన ట్రస్ట్ కువైట్ అధ్యక్షుడు ఇండ్లూరు వజ్రశేఖర్‌రెడ్డి ఆధ్వర్యంలో భక్తులకు అన్నదానం చేశారు. అలాగే వివిధ స్వచ్ఛంద సంస్థలకు చెందిన వారు మజ్జిగ, మంచినీరు ఏర్పాటు చేశారు.

ముఖ్య అతిథిగా 3వ అదనపు జిల్లా జడ్జి..

ఈ కల్యాణ వేడుకలలో ముఖ్య అతిథులుగా 3వ అదనపు జిల్లా జడ్జి ఎస్. ప్రవీణ్ కుమార్, ప్రత్యూష దంపతులు, జనసేన నాయకుడు అతికారి కృష్ణ పాల్గొన్నారు. ఏఎస్పీ మనోజ్ రామ్‌నాథ్ హెగ్డే ఆధ్వర్యంలో అర్బన్ సీఐ రాజా నేతృత్వంలో గట్టి పోలీసు బందోబస్తును ఏర్పాటు చేశారు. అర్బన్ ఎస్ఐ ఎస్ఎల్‌వీ ప్రసాద్ రెడ్డి, ఏఎస్ఐలు సీఎస్‌కే ప్రసాద్‌వర్మ, ఖాసీంసాబ్, సిబ్బంది బందోబస్తు విధులను నిర్వహించారు.

లారీ బోల్తాపడి డ్రైవర్‌కు గాయాలు

పులివెందుల రూరల్ : పులివెందుల పట్టణంలోని అంబకపల్లె రోడ్డు సమీపంలో మంగళవారం ఉదయం మట్టిని తరలిస్తున్న లారీ బోల్తా పడింది. పోలీసుల కథనం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. బెంగళూరు నుంచి మట్టిని తరలిస్తూ ప్రొద్దుటూరు వైపు వెళ్తున్న లారీ పులివెందుల రింగ్ రోడ్డు సమీపంలోని అంబకపల్లి రోడ్డు వద్దకు రాగానే బోల్తా పడింది. ఈ ప్రమాదంలో డ్రైవర్‌కు స్వల్ప గాయాలయ్యాయి. చికిత్స కోసం డ్రైవర్‌ను కడప రోడ్డులో ఉన్న ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.